# కడపలో విషాదం.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అర్ధరాత్రి సమయంలో..




కడప:అక్టోబరు 14 (టుడే విదుర):నగరంలోని శంకరాపురంలో విషాదం చోటుచేసుకుంది. భార్యాభర్త తమ కుమారుడితో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ముగ్గురూ కలిసి అర్ధరాత్రి సమయంలో కృష్ణాపురం సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గూడ్స్ రైలు క్రిందపడి ప్రాణాలు తీసుకున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు డెడ్ బాడీలను శ్రీరాములు, ఆయన భార్య శిరీష, కుమారుడు రుత్విక్‌గా పోలీసులు గుర్తించారు.కుటుంబ కలహాలే కారణమా?ప్రాథమికంగా పోలీసులు అందించిన సమాచారం ప్రకారం, ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో బాధపడుతూ ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాలను రిమ్స్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. పూర్తి వివరాల కోసం పోలీసులు.. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమీప నివాసితుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు.

# విద్యుత్తు ఉద్యోగుల సమ్మె




అమరావతి, విజయవాడ, అక్టోబరు 14 (టుడే విదుర): విద్యుత్తు ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. 15వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సమ్మెలోకి వెళుతున్నామని విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ ఎస్.కృష్ణయ్య ప్రకటించారు. విద్యుత్తు సంస్థల యాజమాన్యంతో సాయంత్రం జరిగిన చర్చల్లో తమ డిమాండ్లపై స్పష్టత రాలేదని తెలిపారు. 29 డిమాండ్లను యాజమాన్యం ముందుంచగా, ప్రధాన అంశాలపై స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. స్పష్టత వచ్చేవరకు సమ్మెపై పునరాలోచన లేదని స్పష్టం చేశారు. మరోవైపు విజయవాడలోని గాంధీనగర్‌లో సోమవారం విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాలో 15 వేల మందికి పైగా విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు. కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యోగులపై యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. కన్వీనర్ఎం.వి.రాఘవరెడ్డి మాట్లాడుతూ ప్రభు త్వం స్పందించకపోవడంతోనే సమ్మె బాట పడుతున్నామన్నారు.

# వడివడిగా డయాఫ్రం వాల్



అమరావతి, అక్టోబరు 14 (టుడే విదుర):పోలవరం ప్రాజెక్టు పనులు 2027 డిసెంబరు నాటికి పూర్తిచేయాలన్న లక్ష్యం దిశగా సాగుతున్నాయి. కొత్త డయాఫ్రం వాల్ పనులు వేగంగా నడుస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో మొదలైన పనులు 58 శాతం పూర్తయ్యాయి. మిగిలిన 42 శాతం పనులు చేస్తూనే.. ఇప్పటికే పూర్తయిన గోడపై సమాంతరంగా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులను నవంబరు 1న ప్రారంభించేందుకు ఇంజనీర్లు సిద్ధమవుతున్నారు. డయాఫ్రం వాల్ నదీ గర్భంలోపల పునాదిలా ఉంటుంది. బయటకు కనిపించదు. కానీ సాంకేతిక పరిశీలన నిమిత్తం.. బయటకు 1.5 మీటర్ల ఎత్తులో నిర్మించారు. ఈ ఎత్తును ఇలాగే కొనసాగిస్తూ.. దానిపై ఈసీఆర్ఎఫ్ డ్యాంను నిర్మిస్తే.. గోదావరి నదికి భారీ వరద వస్తే.. దాని ప్రభావంతో వాల్ కంపించిపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. దీంతో ఆ ఎత్తు తగ్గించడం ప్రారంభించారు.

# విశాఖలో నిషేధిత దగ్గు మందు స్వాధీనం



విశాఖపట్నం, అక్టోబరు 14 (టుడే విదుర): నిషేధిత దగ్గు, జలుబు మందు రివి కోల్డ్‌ను విశాఖపట్నంలోని ఔషధ నియంత్రణ విభాగం అధికారులు పట్టుకున్నారు. స్థానిక కిర్బిలైఫ్ సైన్సెస్ అనే మెడికల్ ఏజెన్సీ గోడౌన్‌లో రూ.4.5 లక్షల విలువచేసే 5,900 నిషేధిత సిరప్‌లను స్వాధీనం చేసుకున్నారు. సిరప్ తయారీ సంస్థలు రెండేళ్ల లోపు పిల్లలకు ఈ మందు వాడకూడదనే లేబుల్‌ను ప్రత్యేకంగా ముద్రించాలి. అయితే ఈ ముద్రణ లేని మందును విశాఖ మద్రిపాలెం ప్రాంతానికి చెందిన వ్యాపారి కొనుగోలు చేసి తెచ్చినట్టు అధికారులకు సమాచారం అందింది. మద్రిపాలెంలోని కిర్బి లైఫ్ సైన్సెస్ ఏజెన్సీ గోడౌన్‌లో తనిఖీలను నిర్వహించగా.. 5,900 నిషేధిత సిరప్‌లు పట్టుబడ్డాయి.

# డ్రైనేజీ కాలువలు కబ్జా

## బీఎన్ రోడ్డుపైకి వర్షంనీరు
## కొద్దిపాటి వానకే వాగును తలపిస్తున్న రహదారి
## నీటి ప్రవాహంతో మరింత పాడైపోతున్న వైనం




చోడవరం, అక్టోబరు 14 (టుడే విదుర):భీమిలి– నర్సీపట్నం రోడ్డులో చోడవరం మండల పరిధిలో పలుచోట్ల ఇరువైపులా డ్రైనేజీ కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. మండలంలో వెంకన్నపాలెం జంక్షన్ నుంచి అంభేరుపురం వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలను కబ్జా చేయడం, లేదంటే ఆయా దుకాణదారులు మట్టితో కప్పేయడంతో, వర్షం నీరు ప్రవహించే మార్గం లేక.. రోడ్డుపై చేరుతున్నది. కొన్నిచోట్ల పొలాల్లో నీరు కూడా రోడ్డుపైకి ప్రవహిస్తున్నది. కొద్దిపాటి వర్షం కురిసినా రహదారులు వాగుల్లా మారిపోతున్నాయి. రోడ్డుపై ఏర్పడిన భారీ గోతుల్లో రోజుల తరబడి నీరు నిలిచిపోతున్నది. ఇప్పటికే అధ్వానంగా వున్న ఈ రహదారి, మరింత దారుణంగా తయారవుతున్నది. గోతులు మరింత పెద్దవి అవుతున్నాయి. రాళ్లు తేలిపోయి వాహనదారులతోపాటు పాదచారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రాత్రిపూట ప్రమాదాలకు గురవుతున్నారు. భవిష్యత్తులో ఈ రోడ్డును అభివృద్ధి చేసినప్పటికీ ఆక్రమణలు తొలగించకపోతే సమస్య మరింత తీవ్రం అవుతుంది. కోట్లాది రూపాయలు వృథా అవుతాయి. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి వెంకన్నపాలెం నుంచి అంభేరుపురం వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని, డ్రైనేజీ కాలువలు తవ్వించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విర్డ్‌లో రొబోటిక్ వైద్య సేవలు



ద్వారకాతిరుమల, అక్టోబరు 14 (టుడే విదుర): రొబోటిక్ టెక్నాలజీతో విర్డ్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఆసుపత్రిలో ఐదుగురికి రొబోటిక్ ఆర్థో శస్త్రచికిత్స ఈనెల 12న డాక్టర్ కృష్ణకిరణ్ నేతృత్వంలో నిర్వహించినట్లు ట్రస్టు ఛైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు తెలిపారు. వైద్యులు కృష్ణకిరణ్ మాట్లాడుతూ రొబోటిక్ టెక్నాలజీతో ఆపరేషన్ ద్వారా రోగికి మెరుగైన, కచ్చితమైన, రక్షణతో కూడిన వైద్యం అందుతుందన్నారు. సర్జన్ ఆదేశాల మేరకు రోబో పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం వైద్య చికిత్సలను అందించ డంలో రోబో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, పి.నాగేంద్రబాబు, సింధు, రమ్య, మహిత, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలకు కొత్త కళ



మెళియాపుట్టి,అక్టోబరు 14 (టుడే విదుర): ప్రభుత్వ పాఠశాలలకు కొత్త కళ వచ్చింది. జిల్లావ్యాప్తంగా 528 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఎస్జీటీలు 122 మంది, స్కూల్ అసిస్టెంట్‌లు 325 మంది, గిరిజన సంక్షేమ పాఠశాలలకు 81 మంది ఉపాధ్యాయులను విద్యాశాఖ కేటాయించింది. వీరికి శ్రీకాకుళంలో ఈ నెల 3 నుంచి 10 వరకు విద్యారంగంలో మార్పులు, బోధన పద్ధతులు, సాంకేతికత వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఆన్‌లైన్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించారు. లీప్ యాప్‌లోనే వారికి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయా ఉపాధ్యాయులంతా తమకు కేటాయించిన పాఠశాలలకు చేరుకోవడంతో కొత్త కళ కనిపించింది. తమ కష్టం ఫలించి.. ప్రభుత్వ కొలువు దక్కడంతో ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లివిరిసింది. మరోవైపు ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో మరింత మెరుగైన బోధన సాగనుందని విద్యార్థులు, తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమైంది.

పెద్దమడి గురుకులంలో 14 మంది..

మెళియాపుట్టి మండలంలోని పెద్దమడి గురుకుల పాఠశాలలో గత 30 ఏళ్ల నుంచి రెగ్యులర్ ఉపాధ్యాయులు లేరు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించి బోధన సాగించేవారు. ఈ పాఠశాలలో 377 మంది విద్యార్థులు చదువుతున్నారు.

# సంక్షోభంలో వ్యవసాయం

-అమరావతి బ్యూరో :అక్టోబరు 14 (టుడే విదుర): కూటమి ప్రభుత్వంలో సాగు రంగం సంక్షోభంలోకి నెట్టబడిందని, రైతుల ఆత్మహత్యలు మళ్లీ ప్రారంభమయ్యాయని వైసిపి ప్రధాన కార్యదర్శి ఎంవిఎస్ నాగిరెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి హయాంలోని ఐదేళ్లలో ఖరీఫ్‌లో సరాసరి 32.94 లక్షల హెక్టార్లలో సాగు జరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండేళ్లలో సాగు విస్తీర్ణం సరాసరి 28.19 లక్షల హెక్టార్లకు తగ్గిపోయిందన్నారు. గడిచిన రెండేళ్లలో 11.73 లక్షల హెక్టార్లలో సాగు లేకపోవడంతో వ్యవసాయ కూలీలకు రూ.3 వేల కోట్లు, పంట ఉత్పత్తులు తగ్గడంతో రైతులకు రూ.6 వేల కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. సాగు సక్రమంగా ఉంటే మొత్తం రూ.9 వేల కోట్ల సంపద ప్రజలకు, తద్వారా మార్కెట్‌కు లభించేదన్నారు. గ్రామాల్లో కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు వలసలు వెళుతున్నట్లు చెప్పారు. గతేడాది 25 మంది, ఈ ఏడాది సెప్టెంబరు వరకూ 8 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వెల్లడించారు. ప్రభుత్వం వీరికి పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తుందన్నారు

# వర్షానికి ఉల్లి రైతు కుదేలు



అవుకు, అక్టోబరు 14 (టుడే విదుర): మండలంలోని ఎర్రమల కొండల్లో తెల్లవారుఝామున కురిసిన భారీ వర్షానికి ఉల్లి పంటను సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎర్రమల కొండల్లోని గ్రామాలైన కొండమనాయునిపల్లె, జూనూతల, ఉప్పలపాడు, కునుకుంట్లలో దాదాపు 500 ఎకరాల్లో ఉల్లి పంటను రైతులు సాగు చేశారు. ఉల్లి పంట సాగు కోసం ఎకరాకు రూ. 45 వేలు ఖర్చు చేశారు. పంట కోత దశకు రావటంతో ఉల్లి పంటను పీకి పొలాల్లోనే ఉంచారు. రాత్రి భారీ వర్షం పడంటంతో పొలాల్లోకి నీరు భారీగా చేరి దాదాపు 50 ఎకరాల్లో పంట మునిగిపోయింది. పంట చేతికి వచ్చే సమయానికి ప్రకృతి కన్నెర్ర చేయటంతో పంట సాగు కోసం తెచ్చిన అప్పు ఎలా తీర్చాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# సినిమా



## ఆస్ట్రేలియాలో చిరుతో భేటీ.. ఎందుకంటే..



తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్‌రావు చిరంజీవిని కలిశారు. ఆస్ట్రేలియాలో నివసిస్తున్న తన మనుమరాలు ఐరా ఆశిష్ కోరిక మేరకు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి చిరుని కలిసినట్లు చెప్పారు. ప్రస్తుతం చిరంజీవి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమా చిత్రీకరణలో ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ ఆస్ట్రేలియాలో జరుగుతోంది. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ఫోటోలు షేర్ చేశారు. %'మెగాస్టార్ చిరంజీవి గారిని షూటింగ్ స్పాట్‌లో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవిగారితోపాటు హీరోయిన్ నయనతారను కూడా కలిశాం. సినీ విశేషాలు, సమకాలీన రాజకీయాలు, ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి అనేక ఆలోచనలు ఇద్దరం పంచుకున్నాము. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ మాకు ఆత్మీయంగా సమయం కేటాయించిన చిరంజీవి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సమావేశం మా కుటుంబానికి మరపురాని ఆనంద క్షణంగా నిలిచింది' అని ఆయన పేర్కొన్నారు. %ప్రస్తుతం చిరంజీవి నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. సుష్మిత కొణిదెల, సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో మీసాల పిల్లా అంటూ ఉదిత్ నారాయణ పాడిన పాట ఈ రోజు సాయంత్రం విడుదల కానుంది. ఆయన యాక్ట్ చేస్తున్న 'విశ్వంభరా' సమ్మర్ లో రిలీజ్ కానుంది

## వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఎస్‌కే..




విజయంతమైన చిత్రాలతో వరుస చిత్రాల్లో నటిస్తున్న హీరో శివకార్తికేయన్ . 'ది గోట్' ఫేం వెంకట్ ప్రభు దర్శకత్వంలో నటించనున్నారు. ఈ ప్రాజెక్టుపై దర్శకుడు వెంకట్ ప్రభు మాట్లాడుతూ, 'శివకార్తికేయన్ కథానాయకుడిగా తాను దర్శకత్వం వహించే చిత్రం ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. వచ్చే యేడాది జనవరిలో చిత్రీకరణ ప్రారంభమతుంది. ఇది వైవిధ్యభరితమైన సైన్స్ ఫిక్షన్ మూవీ. ఇందులో హీరోను సరికొత్త లుక్‌లో చూస్తారు. ఈ ప్రాజెక్టులో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, నిర్మాణ సంస్థ, సంగీత దర్శకుడు తదితర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం శివకార్తికేయన్ తన 25వ చిత్రం 'పరాశక్తి'లో నటిస్తున్నారు. ఈ మూవీ సంక్రాంతికి విడుదల కానుంది. ఆ తర్వాత 'డాన్' ఫేం సిబి చక్రవర్తి దర్శకత్వంలో ఎస్‌కే నటిస్తారు. ఆ తర్వాత వెంకట్ ప్రభుతో కలిసి పనిచేయనున్నారు.

## బ్రదర్ అంటూ పంచులు ఎవరికి..




రాత్రి జరిగిన 'మిత్రమండలి' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్ర సమర్పకుడు బన్నీ వాసు ఘాటు వ్యాఖ్యలు చేశారు. బ్రదర్ మీరెంత ట్రోల్ చేసినా నన్ను పడగొట్టలేరు .. నా పరుగును ఎవరూ ఆపలేరు' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. మరో అడుగు ముందుకేసి.. నెగటివ్ ట్రోల్స్‌తో వెంట్రుకే కాదు ఇంకేమీ పీకలేరని ఫైర్ అయ్యారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఆయన బ్రదర్ అని సంభోదించింది ఎవరిని అనేది దానిపై చర్చ నడుస్తోంది.మిత్రమండలి ట్రైలర్ చూసి ఏ టైమ్‌లో నవ్వాలో చెప్పండని కామెంట్స్ చేస్తున్నారు. 'మీరు సినిమాకి రండి... ప్రతి నిమిషం నవ్వుతారు. లేదంటే మీరు ఏ కామెంట్ అయినా పెట్టుకోండి.. నేను తీసుకుంటాను' అన్నారు బన్నీ వాసు. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు, నిహారిక ఎన్‌ఎం కీలక పాత్రధారులుగా నటించిన చిత్రం 'మిత్ర మండలి'. విజయేందర్ ఎస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప్, విజయేందర్ రెడ్డి నిర్మించారు. బన్నీ వాసు సమర్పకుడు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదల కానుంది.'ఒక వారం నాలుగు సినిమాలు విడుదలైతే ఆ నాలుగూ బాగా ఆడాలని కోరుకునే మనస్తత్వం నాది. ఫేస్ బాల్ మాకే కాబట్టి మేము సిక్స్ కొట్టాలి. అందరు ఎదగాలి అందరితో పాటే మేము ఎదగాలి. 'మిత్రమండలి' ట్రైలర్‌కి చాలామంది కామెంట్స్ చేశారు. నెగిటివ్ ట్రోల్ చేస్తే ఒకడి ఎదుగుదల ఆగిపోతుందనుకుంటే అది మీ కర్మే. ఏ రంగంలో అయిన పోటీ మంచిదే. యుద్ధం చేయడం తప్పు కాదు. కానీ దాన్ని ధర్మంగా చేయాలి. నా యుద్ధం ధర్మమార్గంలో ఉంటుంది. నేనైతే అన్ని సినిమాలు బాగా ఆడాలని కోరుకుంటా. నా సినిమా బాగోగపోతే బాగున్న సినిమా ఆడాలని కోరుకుంటా. అందుకే నాకు అన్ని సక్సెసులు వస్తున్నాయనుకుంటా. ఆడియన్స్ జడ్జిమెంట్‌కి రెస్పెక్ట్ ఇవ్వాల్సిందే. అయితే కావాలని నెగిటివ్‌గా ట్రోల్స్ చేస్తే అది చిన్న పిల్లల చేష్టలనే అనుకోవాలి. 'బ్రదర్ కష్టపడదాం.. ఎదుగుదాం. పైన దేవుడు ఉన్నాడు.. కింద సినిమాను చూసే ప్రేక్షకుడు ఉన్నాడు.

## కబడ్డీ రక్తంలో కలిసిపోయి ఉంటుంది




'బైసన్' చిత్ర నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమించిన ఆ చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్ కష్టానికి ఈ సినిమా ఘన విజయం సాధించాలని యువ హీరో ధృవ్ ఆకాంక్షించారు. ధృవ్ – అనుపమ పరమేశ్వరన్, రజీషా విజయన్ జంటగా మారి సెల్వరాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బైసన్'. ఇతర పాత్రల్లో అమీర్, పశుపతి, లాల్ తదితరులు నటించారు. కబడ్డీ నేపథ్యంగా పా.రంజిత్ నీలమ్ స్టూడియో, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 17న విడుదల కానున్న నేపథ్యంలో ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో ధృవ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం నాతో కలిసి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఎల్లవేళలా నా తల్లిని సంతోష పెట్టేందుకు కోరుకుంటాను. ఈ సినిమా చూసిన తర్వాత ఆమె ఎంతో సంతోషిస్తారు. 'బైసన్' సినిమా కోసం దర్శకుడు మారి సెల్వరాజ్ ఎంతో కష్టపడ్డారు. ఆయన కష్టానికి తగినట్టుగా ఈ మూవీ హిట్ కావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. %ఈ మూవీలో కీలక పాత్ర పోషించిన దర్శకుడు అమీర్ మాట్లాడుతూ, 'ఇందులో వేలుసామి అనే పాత్రలో నటించాను. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ పాత్ర క్రెడిట్ దర్శకుడు మారికే చెందుతుంది. ధృవ్ జాతీయ స్థాయిలో కూడా కబడ్డీ ఆడగలడు. ఈ సినిమా కోసం అసిస్టెంట్లు చాలా కష్టపడి పనిచేశారు. వారితోపాటు దర్శకుడు మారి సెల్వరాజ్‌కు నా అభినందనలు' అన్నారు.%దర్శకుడు మారి సెల్వరాజ్ మాట్లాడుతూ, 'కొన్ని ప్రాంతాల్లో కబడ్డీ ఆట రక్తంలో కలిసిపోయివుంది. ఈ సినిమా కోసం ఎంపిక చేసిన ఆటగాళ్ళు నిజమైన క్రీడాకారులు. ప్రో కబడ్డీ ప్రభంజన్ చాలాబాగా నటించారు. ఈ సినిమా కోసం ధృవ్ రెండేళ్ళపాటు శ్రమించారు. ఆయనకు ఈ సినిమా మంచి బ్రేక్ వస్తుందని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు.



## ఐయామ్ ది గాయ్..

## మెలోడీ సాంగ్ అదిరిపోయింది



కోలీవుడ్ స్టార్ హీరో విష్ణు విశాల్ తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితుడే. ఎఫ్ఐఆర్, మట్టి కుస్తీ లాంటి సినిమాలు తెలుగులో కూడా మంచి పాజిటివ్ టాక్ ను అందుకున్నాయి. ఇక విష్ణు విశాల్ హీరోగా కాకుండా నిర్మాతగా కూడా మంచి సినిమాలను తెరకెక్కిస్తున్నాడు. తాజాగా ఆయన హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం ఆర్యన్. డార్క్ అండ్ సస్పెన్స్ ఫుల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రవీణ్ కె దర్శకత్వం వహించగా విష్ణు విశాల్ స్టూడియోస్, శుభ్ర %ఁ% ఆర్యన్ రమేష్ నిర్మించారు. ఈ చిత్రంలో విష్ణు విశాల్ సరసన శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తోంది.ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఆర్యన్ చిత్రం నుంచి మొదటి లిరికల్ సాంగ్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఐయామ్ ది గాయ్ అంటూ సాగిన ఈ సాంగ్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. పోలీస్ గా విష్ణు విశాల్ కనిపించాడు. అసలు ప్రేమ అంటే తెలియని హీరో.. హీరోయిన్ తో ప్రేమలో పడ్డాకా.. తనలో జరిగిన మార్పులను తనకు తానే చెప్పుకుంటున్నట్లు లిరిక్స్ ఉన్నాయి.జిబ్రాన్ స్వరపరిచిన ఈ పాటకు సామ్రాట్ సాహిత్యం అందించారు. జిబ్రాన్, శ్రీకాంత్ హరిహరన్ అద్భుతంగా పాడారు. ఈ మెలోడీ సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఆర్యన్ చిత్రం అక్టోబర్ 31న విడుదల కానుంది. హీరో నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో శ్రేష్ట్ మూవీస్ ద్వారా విడుదల చేయనున్నారు.

## ఇదెక్కడి విడ్డూరం..

## డిజాస్టర్ మూవీకి ఓటీటీలో రికార్డ్

ఈ మధ్యకాలంలో ప్రేక్షకుల మైండ్ సెట్ ఏంటో అస్సలు తెలియడం లేదు. థియేటర్ లో ఒక సినిమా రిలీజ్ అయిన మొదటి రోజే ఇది ప్లాప్.. డిజాస్టర్ అని పెదవి విరుస్తున్నారు. ఆ తరువాత అదే సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంటే దానికి బ్రహ్మరథం పడుతున్నారు. తాజాగా థియేటర్ లో డిజాస్టర్ అయిన సినిమా ఓటీటీలో రికార్డ్ సృష్టించింది. ఆ సినిమా ఏంటి అంటే వార్ 2.మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ , హృతిక్ రోషన్ మల్టీస్టారర్ గా తెరకెక్కిన చిత్రం వార్ 2. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ సినిమాను బ్యానర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. ఇక ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్ గా నటించింది. ఎన్నో అంచనాల నడుమ ఆగస్టు 15 ఈ సినిమా రిలీజ్ అయ్యి భారీ పరాజయాన్ని అందుకుంది. ఎన్టీఆర్ బాలీవుడ్ డెబ్యూ కావడంతో ఎన్టీఆర్ ఫ్యాన్స్ కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసారు కానీ, వారిని కూడా వార్ 2 నిరుత్సాహపడేలా చేసింది.ఇక వార్ 2 ఎట్టకేలకు ఈ మధ్యనే ఓటీటీ బాట పట్టింది.

